# ‘ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక’తో పాలన మరింత చేరువ




వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 28జూన్, 2026 | పేజీలు : 08

## విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి

# నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత

పెద్దపలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** అభ్యసన ఫలితాలు పనితీరు గ్రేడింగ్ సూచికలు, లెర్నింగ్ మేనేజ్‌మెంట్, సమర్థవంతమైన తరగతి గది బోధనపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.శనివారం పెద్దపల్లిలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన విద్యలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులు స్వతంత్రంగా చదవడం, మాట్లాడడం నేర్చుకున్న అంశాలను సృజనాత్మకంగా వ్యక్తపరిచేలా తీర్చిదిద్దాలని కోరారు.ప్రతి పాఠశాలలో వార్షిక విద్యా ప్రణాళిక, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక,పాఠ్య ప్రణాళికలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి రెమెడియల్ బోధన అందించాలని స్పష్టం చేశారు. డిజిటల్ వనరులు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పారు.విద్యార్థుల విద్యా ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ,ఆ సమాచారాన్ని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో క్రమం తప్పకుండా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. శాఖ మార్గదర్శకాల ప్రకారం ఉపాధ్యాయుల బోధనా ప్రక్రియను మండల విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అకాడమిక్ ప్యానల్ తనిఖీ బృంద సభ్యులను కలెక్టర్ పరిచయం చేయగా, హాజరైన ఉపాధ్యాయులకు అకాడమిక్ ప్లానింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సమీక్షా సమావేశానికి జిల్లా వ్యాప్తంగా 14 మండలాల నుండి సుమారు 1000 మంది ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా విద్యా శాఖా ఏఎంఓ డాక్టర్. పి.ఎం. షేక్, సెక్టోరల్ అధికారులు మల్లేశ్,జిసిడిఓ కవిత,అలోకిట్,ఆర్పీ సమీర్,ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజా పక్షం/ వేములవాడ :** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆలయానికి విచ్చేసి శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో, స్వస్తివాచనంతో ఘన స్వాగతం పలికారు. శని త్రయోదశి సందర్భంగా ఆలయంలోని నవగ్రహ మండపంలో శనీశ్వర స్వామివారికి నువ్వుల నూనెతో తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం నల్ల వస్త్రం సమర్పించి, నవ ధాన్యాలతో ప్రత్యేక పూజలు చేసి శని దోష నివారణ కోసం ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ కు స్వామివారి తీర్థప్రసాదం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందించి వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) రమాదేవి సహాయ కార్యనిర్వహణాధికారులు (ఏఈఓలు) జి. శ్రావణ్ కుమార్, జి. అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నూగూరి నరేందర్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

## ప్రతీ ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ



ఓటరు నమోదు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జులై 3వ తేదీలోపు ప్రతీ అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం పెద్దపల్లి పట్టణంలోని 4 వ వార్డు ప్రగతి నగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు

వివరాలు మెయిన్‌లో...

## హక్కుల సాధన కోసం సమ్మెకైనా వెనుకాడం



వివరాలు మెయిన్‌లో...

# ఫర్టిలైసర్ గోదాం హమాలీ కార్మికులకు పని భద్రత కల్పించాలి

### టేకుమల్ల మ్మయ్య ఏఐటీయుసి రాష్ట్ర కార్యదర్శి




**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్రంలోని ఫర్టిలైసర్ అండ్ సీడ్స్ గోదాముల్లో పనిచేస్తున్న హమాలి కార్మికులకు పని భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం రోజున కరీంనగర్ ప్రధాన వ్యవసాయ మార్కెట్ కమిటీ లోని గోదాంవద్ద కరీంనగర్ జిల్లా ఫర్టిలైజర్స్ అండ్ పేస్టి సైడ్స్, ఏఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏఐటియుసి రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని కరపత్రాన్ని కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమ్మయ్య,కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్ గోదాముల్లో,కంపెనీల్లో పనిచేస్తున్న హమాలి కార్మికులకు పని భద్రత లేకుండా పనులు చేస్తున్నారని వీరికి ఫెర్టిలైజర్స్ కంపెనీ గాని పర్టిలైజర్స్ డీలర్స్ గాని ఎలాంటి పని భద్రత కల్పించకుండా లారీ దించేటప్పుడు అనేకమైనటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయి కాబట్టి వీరికి ప్రమాద బీమా సౌకర్యం, పీఎఫ్, సౌకర్యం కల్పించాలని, కల్పించే విధంగా కార్మిక శాఖ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ రానున్న రోజుల్లో రాష్ట్రంలోని పెర్టిలైజర్ సీడ్స్ కంపెనీ గోదాములలో పనిచేస్తున్న కార్మికులందరినీ ఐక్యం చేసి కార్మికుల సమస్యలపై పోరాటాల నిర్వహిస్తామని ఈ డిమాండ్ల పైన సెప్టెంబర్ లో జరిగే రాష్ట్ర మహాసభల్లో సమస్యలపై తీర్మానం చేయడం జరుగుతుందని వారు తెలిపారు. రాష్ట్రంలోని పెర్టిలైజర్స్,సీడ్స్ కంపెనీలలో గోదాముల్లో పనిచేస్తున్న కార్మికులందరూ కలిసికట్టుగా వచ్చి సెప్టెంబర్ 6,7,8 తేదీలలో కరీంనగర్ నగరంలో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభలలో పాల్గొని జయప్రదం చేయాలని సమ్మయ్య, బుచ్చన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కరీంనగర్ జిల్లా పెర్టిలైజర్, పర్టీసైడ్ గోదాంల హమాలి సంఘం జిల్లా అధ్యక్షులు కదారి బీరయ్య, ఉపాధ్యక్షులు ఆవుల లక్ష్మణ్, కార్యదర్శి, రాజు కోశాధికారి మామిళ్ళపల్లి శంకరయ్య నాయకులు రాయమల్లు, పి మహేష్, కదారి కొమురయ్య,బి అంజయ్య, పుల్ల మహేష్, రేషవేని సదయ్య ,వేల్పుల రాజయ్య ,కే ఐలయ్య, ఆర్ రాములు హమాలి కార్మికులు పాల్గొన్నారు.

# జిల్లాలోనే మొట్టమొదటి స్పేస్ ల్యాబ్ ప్రారంభించిన పారమిత

**ప్రజాపక్షం / కొత్తపల్లి:** పాఠశాల విద్యారంగంలో ఒక సరికొత్త మైలు రాయిని అధిగమిస్తూ నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల అత్యాధునిక పారమిత స్పేస్ ల్యాబ్ ను శనివారం ప్రారంభించింది. పాఠశాల స్థాయిలో అంతరిక్ష విద్యను పరిచయం చేసిన మొట్టమొదటి విద్యా సంస్థగా పారమిత హెరిటేజ్ పాఠశాల కరీంనగర్ జిల్లాలోనే సరికొత్త చరిత్ర సృష్టించింది. ల్యాబ్ ప్రారంభం విద్యార్థులలో భవిష్యత్‌కు అవసరమైన శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిచడానికి ప్రయోగాత్మక అభ్యాసాన్ని అందించడానికి ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. విద్యార్థులలో చిన్న వయస్సు నుంచే ఉత్సుకతను రేకెత్తించడానికి ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించడానికి ఈ స్పేస్ ల్యాబ్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. ఈ సందర్భంగా చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు మాట్లాడుతూ అంతరిక్ష విద్య అంటే కేవలం గ్రహాలు, నక్షత్రాల గురించి చదువుకోవడం మాత్రమే కాదని ఇది విద్యార్థుల పెద్ద కలలు కనేలా శాస్త్రీయంగా ఆలోచించేలా రేపటి భవిష్యత్ ఉద్యోగాలకు సిద్ధమయ్యేలా ప్రేరేపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపి కృష్ణ, డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, రాకేశ్, అనూకర్ రావు, వినోద్ రావు, వియుయం ప్రసాద్ హన్మంతరావు, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జాతీయ పల్స్ పోలియో

### మండల వైద్యాధికారి కీర్తన

**ప్రజాపక్షం / చొప్పదండి :** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం 05 సంవత్సరాల వయసు లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మండల వైద్యాధికారి కీర్తన తెలిపారు. కావున తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలకు సమీప పోలియో కేంద్రాల వద్దకు తీసుకెళ్లి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కమిటీ హాల్‌లు ఇలా 12 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలందరూ సహకరించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలుమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం మల్లాపూర్ గొర్రెపల్లి సిర్పూర్ గ్రామాలలో పర్యటించి అభివృద్ధి పనులకు భూమి పూజ, నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. గొర్రెపల్లి గ్రామంలో,21 లక్షల,20000 వేల రూపాయలతో ప్రైమరీ పాఠశాల ప్రహరీ నిర్మాణం, కాలనీలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనచేశారు, అదే విధంగా మండల కేంద్రంలో ఎన్ఆర్‌జిఎస్ నిధులు 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించి, వడ్డెర కాలనీలో నూతన సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అహర్నిశలు కృషి చేస్తూ కట్టుబడి ఉందని, అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. ప్రజలకు ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏలాల జలపతి రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సోమయ్య, ఇరు రామాల సర్పంచులు చిట్యాల లక్ష్మ ణ్,పెంట సౌజన్య శ్రీనివాస్, ఏలేటి వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ లు గడ్డం సోమారెడ్డి,నాగార్జున రెడ్డి,రా జు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్ నూతి పెల్లి రాజం,వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

# 16వ వార్డులో అభివృద్ధి, ప్రజారోగ్య కార్యక్రమాలు పరిశీలన

**ప్రజాపక్షం /మెట్‌పల్లి:** మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో జరుగుతున్న వాటర్ సప్లై పైప్‌లైన్ మరమ్మత్తు పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు.పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం వార్డులో చేపట్టిన ప్రత్యేక ఓటరు పరిశీలన (ఎన్యుమరేషన్) ఫారాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.తదుపరి 16వ వార్డులో కొనసాగుతున్న ఫీవర్ సర్వేను పరిశీలించి,జ్వర లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రజల్లో అప్రమత్తత కల్పించాలని సిబ్బందికి సూచించారు. 16వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి అరిసె వనజ, డిఇనాగేశ్వరరావు,శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్,విష్ణు,ముజీబ్,నరసయ్యతో పాటు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# మత్తుకు బానిస కాకండి.. చదువుపై దృష్టి సారించండి

### జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి

### ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై న్యాయ విజ్ఞాన సదస్సు

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి సూచించారు.అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.నేడు వివిధ రకాల మాదకద్రవ్యాలు విద్యార్థులకు సులభంగా అందుబాటులోకి రావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగ బాధితులకు చట్టపరమైన సేవలు, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడం అవసరమని అన్నారు. అవగాహన లేకపోవడం వల్ల కొంతమంది యువత మత్తు పదార్థాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించిన ఆమె, టీనేజ్ విద్యార్థులు మత్తు పదార్థాల ఆకర్షణకు దూరంగా ఉండి విద్య, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారిస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు.అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు దూరంగా ఉంటాం అనే ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవిని శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దయ్యా రాజారాం,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి, ఎస్పై పబ్బా కిరణ్ కుమార్, న్యాయవాదులు కోటగిరి వెంకటస్వామి, గడ్డం శంకర్ రెడ్డి,పుప్పాల భానుమూర్తి, తోగిటి రాజశేఖర్, ఎల్లాల మధుసూదన్ రెడ్డి, నేరెళ్ల శ్రీధర్, గజెల్లి రామ్‌దాస్,తలారి రాజశేఖర్, కోటగిరి చైతన్య, బాస రాములు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. దేవరాం,అధ్యాపకులు శ్రీనివాస్, ప్రతిభ,స్వర్ణలత,మంజుల,తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంలో ఇంటర్ సైన్స్‌వింగ్ అడ్మిషన్లు

### బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం /చొప్పదండి:** చొప్పదండి పట్టణ సమీపంలోని కొలిమికుంట గురుకుల పాఠశాలలో హాస్టల్ వసతి లేదనే కారణంతో నిలుపదల చేసిన ఎంపిసీ, బైపీసీ సెక్షన్లలో అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని ఎంపిటిసి ఫోరం మాజీ మండల అధ్యక్షులు, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గత సంవత్సరం కూడా హాస్టల్ వసతి లేదని అడ్మిషన్లు తీసుకోలేదని సంవత్సరం గడిచినప్పటికీ వసతి ఏర్పాటు చేయడంపై కానీ నూతన అడ్మిషన్లపై కానీ దృష్టి సారించిన నాధుడే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల 160 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం కోల్పోయారని జిల్లా కలెక్టర్ సత్వరం స్పందించి గురుకుల పాఠశాలలో ఇంటర్ సైన్స్ విభాగం అడ్మిషన్లు ప్రారంభించాలని కృష్ణారెడ్డితోపాటు మండల శాఖ అధ్యక్షులు మొగిలి మహేశ్, దొంతిసారపు సంపత్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే సంజయ్ అండతో స్వగ్రామానికి నాగరాజు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** రాఘవపేట గ్రామానికి చెందిన చిట్యాల నాగరాజు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన బెహరన్ వెళ్లి ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకొని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నాగరాజుకు అండగా నిలిచారు.కంపెనీ వీసా పై వెళ్లి ఇబ్బందులు పడుతున్న నాగరాజు స్వగ్రామానికి రావడనీకి సైతం ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో రాఘవపేట బిఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్వగ్రామానికి రావడానికి అయ్యే విమాన ఖర్చులకు 30000 నగదును బాధిత కుటుంబానికి అందించి అండగా నిలిచారు.కాదా శనివారం గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ నాయకులు నాగరాజు కుటుంబానికి అందజేశారు.తమ ఆర్థిక ఇబ్బందులు తెలుసుకొని అండగా నిలిచిన ఎమ్మెల్యే సంజయ్ కు నాగరాజ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మద్దెల నరసయ్య, మాజీ ఉపసర్పంచ్ అమీనుద్దీన్, బి.ఆర్.ఎస్వి వర్గ నాయకుడు బైరి రవికుమార్ యాదవ్,గ్రామ శాఖ అధ్యక్షుడు సిద్దు రాజ్ కుమార్ ,నాయకులు నరసయ్య ,బైరి రాకేష్ ,దేవన్న ,మీనయ్య, స్వామి,తదితరులున్నారు.

# బాలలకు స్నేహపూర్వక న్యాయ సేవలపై అవగాహన

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నేడు మంకమ్మతోట (ధన్గర్వాడి) ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాలలకు స్నేహపూర్వక న్యాయ సేవలు (చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్) అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శివ కుమార్ అనుమతితో, కార్యదర్శి, న్యాయమూర్తి కే. రాణి ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని బాలల న్యాయ సేవల విభాగం ఆధ్వర్యంలో చేపట్టారు . ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, ప్యానెల్ న్యాయవాదులు చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, ఏ, కిరణ్ కుమార్, పెరుక రంగయ్య, బి.శాంతి కుమార్, టి. పాల్గొని అశ్విని మాట్లాడారు. బాలల హక్కులు, బాలల భద్రత, ఉచిత న్యాయ




సేవలు, బాల్య వివాహాల నివారణ, యాసిడ్ దాడుల బాధితులకు చట్టపరమైన రక్షణ, పోక్సో చట్టం–2012 లోని ముఖ్య నిబంధనలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ మార్గదర్శకాల మేరకు ఏర్పాటు చేసిన లీగల్ సర్వీసెస్ యూనిటీ ఫర్ చిల్డ్రన్ గురించి వివరించారు. ప్రమాదంలో ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్, రక్షణ, పునరావాసం అందించడంతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం ద్వారా అవసరమైన సేవలు అందించడంలో లీగల్ సర్వీసెస్ యూనిటీ ఫర్ చిల్డ్రన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పిల్లలపై ఎలాంటి వేధింపులు, దుర్వినియోగం లేదా హింస జరిగినా వెంటనే సంబంధిత అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ –1098కు సమాచారం అందించాలని కోరారు. ప్రతి చిన్నారి హక్కులను పరిరక్షించడం కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు యం. శ్రీనివాస్, ఉపాధ్యాయులు రవీందర్, శ్రీలత, పారా లీగల్ వాలంటీర్ లు సంజయ్ కుమార్, శామీమ్, స్వప్న మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయంలో పోలీసు కమిషనర్ వార్షిక తనిఖీ



**ప్రజాపక్షం/కరీంనగర్:** పోలీస్ శాఖలో పరిపాలనా దక్షత, పారదర్శకతను పెంపొందించే భాగంలో భాగంగా శనివారం తిమ్మాపూర్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో వార్షిక తనిఖీలను సిపి గౌష్ ఆలం నిర్వహించారు. ఈ సమగ్ర సమీక్షలో కార్యాలయ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, ప్రజల ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియల సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీల్లో భాగంగా కార్యాలయ ప్రాంగణంలోని అంతర్గత, బాహ్య పరిసరాల పరిశుభ్రతను సిపి నిశితంగా పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పరిధిలోని స్టేషన్ రికార్డులు, పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు,వాటి దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రస్తుతం సర్కిల్ పరిధిలోని అన్ని రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉందని, కేసుల దర్యాప్తు పురోగతి సంతృప్తికరంగా ఉందనిసిపిపేర్కొన్నారు. సుమారు నెల రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించిన కొత్త సర్కిల్ ఇన్స్పెక్టర్‌బొల్లం రమేష్, అప్పుడే సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటుండటాన్ని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎసిపివిజయకుమార్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్, ఎస్ఐలు అన్వర్, గన్నేరువరం ఎస్ఐ నరేందర్ రెడ్డి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### నంబర్ ప్లేట్లు సరిగా వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

కరీంనగర్ నగరంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శనివారం వన్‌టౌన్ కార్నర్ వద్ద చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు, తప్పుగా అమర్చిన నంబర్ ప్లేట్లు, అలాగే నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ ఎసిపియాదగిరిస్వామి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 115 వాహనాలను సీజ్ చేశారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం సంబంధిత నిబంధనల మేరకు జరిమానాలు విధించడంతో పాటు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇలాంటి నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్‌లుసంజీవ్, అంజయ్యతో పాటు ట్రాఫిక్ ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఆల్ఫోర్స్' ఇ–టెక్నో విద్యార్థులకు ఒలంపియాడ్‌లో ప్రశంసా పత్రాలు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో విద్యార్థులకు వివిధ ఒలంపియాడ్‌లలో ప్రశంసా పత్రాలు రావడం ఎంతో సంతోషంగా ఉందని విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుండే వివిధ రకాల పోటీ పరీక్షల పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలో పాల్గొని విజేతలుగా నిలబడేందుకు కృషి చేయాలని అన్నారు. విద్యార్థులకు ప్రతి అంశం పట్ల అవగాహన ఉండాలని తద్వారా విజయం సాధిస్తారని అన్నారు. తరగతి గదిలో నేర్చుకుంటున్న విషయాలను అనునిత్యం సాధన చేయాలని పట్టు సాధించాలని తద్వారా వివిధ సంస్థలు నిర్వహించే పోటీ పరీక్షలకు సైతం హాజరై ఉత్తమంగా నిలవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుష్పగుచ్ఛంతోపాటు పతకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో సొంత నిధులతో నిర్మాణ పనులు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను టిపిసిసి డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్ రావు శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమయ్యే టాయిలెట్లు వంట చేయడానికి రేకుల షెడ్డు, టై బెల్టు తన సొంత నిధులతో నిర్మిస్తానని హామీ ఇచ్చి నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. వీరి వెంట రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, మెట్పల్లి ఏఎంసి చైర్మన్ కూన గోవర్ధన్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జెల్లా ప్రసాద్,మాజీ ఉపసర్పంచ్ ఎనడ్ల రాములు, నాయకులు వంగ శ్రీనివాస్,మెహబూబ్ శ్రీధర్ రాజు, నరసయ్య ,శ్రీకాంత్, ప్రవీణ్, రాజేందర్, తదితరులు ఉన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పనులు పరిశీలన



**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వర్ష కొండ గ్రామంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా బి ఎల్ వో లు చేపడుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని కోరుట్ల ఆర్డీఓ, ఈఆర్‌వో ఎల్. జీవాకర్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ నేరుగా ఫారాలు పంపిణీ చేయాలని, పంపిణీ చేసిన వివరాలనే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, మరణించినవారు, వలస వెళ్లినవారు, డబుల్ ఓటు కలిగిన వారికి ఫారాలు ఇవ్వవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కే. ప్రసాద్,సీనియర్ అసిస్టెంట్ సిహెచ్.రాజారామ్,ఆర్ ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్లు

### ఎఐఎస్ఎఫ్ టిజి రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జి రెహమాన్




**ప్రజాపక్షం / కొత్తపల్లి :** శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం శాతవాహన యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యూనివర్సిటీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రశ్నించేవారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ప్రొఫెసర్‌గా విద్యార్థులను చైతన్యం చేయాల్సిన వీసీ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు పట్ల తమ వైఖరి మార్చుకోవాలని లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణకు గర్వకారణంగా ఉన్న శాతవాహన యూనివర్సిటీ పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ విద్యార్థులకు 24 గంటలు లైబ్రరీ సౌకర్యం కల్పించాలని, మౌలిక సదుపాయాలు పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ నగర ఉపాధ్యక్షులు కసిరెడ్డి సందీప్, శాతవాహన యూనివర్సిటీ లోని వివిధ డిపార్ట్‌మెంట్‌ల విద్యార్థులు శివాజీ, లక్ష్మణ్, ప్రవీణ్, శివ, అశోక్, క్రిష్ణ, సాయికిరణ్, రోహిత్ శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భద్రతలో అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలోని సెక్యూరిటీ సిబ్బంది,వాచ్ మెన్లు ఆలయ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి సూచించారు.ధర్మపురి సర్కిల్ కార్యాలయంలో శనివారం శ్రీ లక్ష్మీ నృసింహ దేవస్థానంలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది,వాచ్ మెన్లతో సమావేశం ఏర్పాటు చేసి కీలక అదేశాలు,సూచనలు చేశారు.ఇటీవల ప్రముఖ పుణ్యక్షేత్రం బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో జరిగిన చోరీ ఘటన నేపథ్యంలో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో సీఐ మాట్లాడారు.ప్రతీ నిత్యం వందలాదిగా భక్తుల తాకిడి వుండే ఆలయ పరిసరాల్లో అనుమానస్పదంగా సంచరించే వ్యక్తులపై మరింత నిఘా ఉంచి వెంటనే ధర్మపురి పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.ఈ సమావేశంలో సీఐ రాం నర్సింహారెడ్డి,ఎస్సై గురుక మహేష్,దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్,సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** 2026–27 విద్యా సంవత్సరానికి గాను కరీంనగర్‌లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు (ఇంగ్లీష్ మీడియం,10వ తరగతి తెలుగు మీడియం) ప్రవేశానికి అర్హత గల అంధ బాలబాలికల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన దరఖాస్తుదారులు 06 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఉత్తర తెలంగాణ కు చెందిన అంధ బాలబాలికలు మాత్రమే ప్రవేశానికి అర్హులని, ఉమ్మడి కరీంనగర్,ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన వారికి ప్రవేశంలో ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, ఈ పాఠశాలలో ఉచిత విద్య,పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, పాదరక్షలు, వసతి గృహ సౌకర్యం కల్పించబడుతుందని పేర్కొన్నారు.ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవడానికి సదరం,డిజబిలిటీ సర్టిఫికేట్, స్టడీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో కూడిన దరఖాస్తులను ప్రిన్సిపాల్, ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల,మల్యాలపూర్ రోడ్, శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా, విజయపురి కాలనీ, కరీంనగర్ వారి కార్యాలయంలో సమర్పించాలని,మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో 9701190127,9440338424 ఫోన్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని ప్రభుత్వ అందుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ ఆ ప్రకటనలో తెలిపారు.

## గ్రామాభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలి


### జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్



**ప్రజాపక్షం/ధర్మపురి :** గ్రామాభివృద్ధిలో భాగంగా ధమ్మన్నపేట గ్రామంలో నిర్వహించనున్న రోడ్డు విస్తరణ,విద్యుత్తు పోల్స్ షిఫ్టింగ్ కై గ్రామ ప్రజలు అధికారులకు సహకరించాలని జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్ కోరారు.రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం గ్రంథాలయ చైర్మన్ దినేష్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్,ధర్మపురి దేవస్థానం మాజీ చైర్మన్ జక్కు రవీందర్ లు ధమ్మన్నపేట గ్రామాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామంలో జరిగే రోడ్డు విస్తరణ పనులలో భాగంగా కరెంట్ పోల్స్ షిఫ్టింగ్ చేస్తూ నూతన పోల్స్ వేసే పనులను ఆదివారం చేపట్టాలని సంబందిత ఏఈ తో మాట్లాడారు.అదేవిధంగా రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాకర్ కు దినేష్ సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్,గ్రామ ప్రజలు ఉన్నారు.

## ఫారాల పంపిణీ ప్రక్రియను వేగవంతం

### ఇ ఆర్ ఒ జి. నరసింహారావు



**ప్రజాపక్షం/ధర్మపురి :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రత్యేక సవరణలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని మెట్ పల్లి ఆర్డీఓ,ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ జి.నరసింహారావు అన్నారు.ధర్మపురి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై ముఖ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ నరసింహారావు మండల పరిధిలోని బి ఎల్ ఓ,సూపర్వైజర్లతో పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఈఆర్వో నరసింహారావు మాట్లాడుతూ.. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం వేగవంతం చేయాలని అన్నారు.ఇప్పటివరకు జరిగిన పురోగతి సంతృప్తికరంగా ఉన్నప్పటికీ ఎక్కడా ఎలాంటి లోపాలు జరుగకుండా చూసుకోవాలని తెలిపారు. సమీక్షానంతరం పట్టణంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఫారాల ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్వోఓ,బీఎల్ఏ లతో మాట్లాడి ఓటర్ల నమోదు,సవరణల విషయంలో పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, నాయబ్ తహశీల్దార్ తిరుపతి,గిర్దావర్లు వి.భాస్కర్ రావు,ఎం.శ్రీనివాస్, అంగన్వాడీ సూపర్వైజర్లు స్వప్న,సరస్వతి, నీలిమ ఉన్నారు.

## చెట్టును ఢీ కొట్టిన కారు

ప్రమాదంలో తహసీల్దార్ రమేష్ గౌడ్ కు తీవ్ర గాయాలు

ప్రజాపక్షం /కథలాపూర్ : జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల తహసీల్దార్ రమేష్ గౌడ్ ప్రయాణిస్తున్న కారు పోసానిపేట శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టగా ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తహసీల్దార్ రమేష్ గౌడ్ ను హుటాహుటిన ఆసుపత్రి కి తరలించారు. తహసీల్దార్ రమేష్ గౌడ్ స్వయంగా కారు నడుపుకుంటూ వస్తుండగా మూలమలుపు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో ఆయన చెయ్యి విరిగినట్లు సమాచారం.ఈ ప్రమాదకరమైన మూలమలుపుల వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలను అరికట్టడానికి ఆర్ అండ్ బి అధికారులు సూచిక బోర్డులతో పాటు తగిన ఏర్పాట్లు చెయ్యాలని ప్రజలు కోరుతున్నారు.

# కాళేశ్వరం నీటితో ఎల్ఎండిని నింపాలి

### మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

### నీళ్లు లేని జలాశయంలో ఆటలు ఆడి నిరసన తెలిపిన మాజీ మంత్రి

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగర ప్రజలకు, హుజురాబాద్, మానకొండూరు నియోజకవర్గం రైతులు సాగు నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మిడ్ మానేర్, ఎల్ ఎం డి జలాశయాలను కాళేశ్వరం నీళ్లతో నింపాలని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఎల్ఎండిలో శనివారం వినూత్న కార్యక్రమంతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీమంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ శ్రేణులతో కలిసి అడుగంటిన జలాశయంలో ఆటలను ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కరీంనగర్ రెండు దశాబ్దాల చరిత్రలో జూలై మాసంలో ఎల్. ఎం. డి నీటి నిల్వలు డేడ్ స్టోరేజ్ కి పడిపోవడం ఇదే మొదటిసారి అని, కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ప్రజలకు త్రాగునీరు, సాగునీరు అందకుండా పోతుందన్నారు. మేడిగడ్డను మరమ్మత్తు చేయకపోవడం ద్వారా ప్రతిరోజు 10 నుంచి 15 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తుందని, ఆ నీటిని నిల్వ చేసి.. మేడిగడ్డ నుండి కన్నెపల్లి,సుందిళ్ల, అన్నారం, ఎల్లంపల్లి లకు తరలించి.. ఎల్లంపల్లిలో మోటార్లను ఆన్ చేసి.. వరద కాల ద్వారా మిడ్ మానేరు, ఎల్ఎండి లను నీటితో నింపాలన్నారు. మిడ్ మానేరు పై ఆచంపల్లి దగ్గర ఉన్న తూము ద్వారా నీటిని విడుదల చేసి కొత్తపల్లి మండలంలోని బావు పేట, ఎలగందుల, నాగుల మల్యాల, బద్దిపల్లి, కమాన్పూర్, శ్రీరాములపల్లి , కాజీపూర్ గ్రామ చెరువులు నింపాలన్నారు. ప్రభుత్వం చేతకాదని చేతులెత్తేస్తే కెసిఆర్ నాయకత్వంలో కెటిఆర్, హరీష్ రావు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి.. కన్నెపల్లి లో ఉన్న మోటార్లను ఆన్ చేసి.. ప్రజలకు నీరందిస్తామన్నారు. బేషాజాలకు పోకుండా ప్రజలకు నీరందించాలని డిమాండ్ చేశారు. టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రతిరోజు త్రాగునీరు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. . పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇటు త్రాగునీరుకు కరీంనగర్ ప్రజలకు ఇబ్బంది తలెత్తుతుందని ఎల్ఎండి మీద ఆధారపడి వ్యవసాయం సాగు చేసుకుంటున్నా మానకొండూరు, హుజురాబాద్ నియోజకవర్గ రైతులకు సాగునీరు లేక రైతులు రోడ్డున పడే పరిస్థితి ఉత్పన్నమవుతుందన్నారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని ఎత్తిపోసి.. ఏప్రిల్, మే మాసాలలోనే.. ప్రాజెక్టులన్నింటినీ నింపి తద్వారా చెరువులకు నీరును తరలించి మత్తుదులు దుంకించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు నీటిని అందించే వరకు పోరాడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో.. ఎమ్మెల్యే గంగులతో పాటు.. బారాస కార్పొరేటర్లు, ఆయా గ్రామాల సర్పంచులు,మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు.. పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు

**ప్రజాపక్షం/రామగిరి:** సింగరేణి సౌజన్యంతో నడుస్తున్న సెంటెనరీ కాలనీ వాణి హైస్కూల్లో ఇటీవల ఫీజుల పెంపు సింగరేణి కార్మిక పేద మధ్యతరగతి కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.పాఠశాలలో మౌలిక సదుపాయాల విస్తరణ,విద్యా ప్రమాణాల మెరుగుదల లేదా కొత్త సౌకర్యాల కల్పన వంటి అంశాలపై స్పష్టమైన వివరాలు వెల్లడించకుండా ఫీజులు పెంచడం సమంజసమేనా అనే ప్రశ్న తలెత్తుతోంది.సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నడవాల్సిన విద్యాసంస్థల్లో సాధారణ కార్మిక కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం మోపడం బాధాకరం.ఈ అంశంపై సింగరేణి యాజమాన్యం,సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఫీజుల పెంపుపై పూర్తి వివరాలు వెల్లడించాలి.అలాగే తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఫీజుల పెంపును పునఃసమీక్షించాలని.కార్మికుల పిల్లల విద్య హక్కును కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత. చోద్యం చూస్తున్న డీఈవో ఎంఈఓ వీరిపైన విద్యాశాఖ కమిషనర్ కు ఫిర్యాదు చేస్తాం టిఆర్ఎస్ నాయకుడు దోచుకుంటుంటే చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్తింపు సంఘం ప్రాతినిత సంఘాలు పట్టించుకోవడం లేదు బిజెపి నాయకుడు మోర్మారి శ్రీనివాస్,కార్యక్రమం లో మెరుగు శ్రీకాంత్ ,దంతుల సురేష్ ,కమలాకర్ పాల్గొన్నారు.

## బాలసదన్‌ను సందర్శించిన జడ్జి భవాని



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పెద్దపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి వ నగర భవాని పట్టణంలోని నూతనంగా నిర్మించబడిన బాలసదన్, వృద్ధాశ్రమం, మానసిక వికలాంగుల స్కూల్ ను శనివారం సందర్శించారు ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకుల పనితీరు పై వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు తదనంతరం బాలసదనం ను సందర్శించిన స్టాక్ రిజిస్టర్ లను, పిల్లలకు అందించే మెనూ కూడా పరిశీలించారు పిల్లలకు సరియైన ఆహారం వసతులు కల్పించాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను లేదా జిల్లా సంక్షేమ శాఖ అధికారులకు తెలిపినట్లైతే సమస్య పరిష్కారం వీలు కల్పిస్తారని జడ్జి భవాని తెలిపారు. మానసిక వికలాంగుల స్కూల్ ను సందర్శించి టీచర్లను బోధన పద్ధతులను చూసి సంతృప్తి చెందారు.

## ప్రజాప్రతినిధికి తప్పని అవమానం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామ పంచాయతీలో ప్రజా ప్రతినిధులకే రక్షణ లేని పరిస్థితులు నెలకొన్నాయని,అభివృద్ధిని ప్రశ్నించినందుకు వార్డ్ సభ్యుడిపై సర్పంచ్ భర్త,కుమారుడు దౌర్జన్యానికి దిగారంటూ 5వ వార్డ్ సభ్యుడు బోలం వినయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మేరకు శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ప్రెస్ నోట్ ద్వారా వివరాలను వెల్లడించారు.ఈ నెల 1న జరిగిన గ్రామ పంచాయతీ జనరల్ బాడీ సమావేశంలో గ్రామాభివృద్ధి పనులు మరియు భోజన్న చెరువుకు సంబంధించిన ప్రజా సమస్యలను తాను చర్చకు పెట్టానని వినయ్ తెలిపారు. ఈ క్రమంలో,ఎటువంటి అధికారిక హోదా లేని గ్రామ సర్పంచ్ భర్త నర్ల పోల్ రాజ్ మరియు వారి కుమారుడు నర్ల సాయి సమావేశంలోకి దూరి,తనను అడ్డుకోవడమే కాకుండా భయభ్రాంతులకు గురి చేశారని ఆయన ఆరోపించారు.కేవలం తనను మాత్రమే కాకుండా,సమావేశంలో విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులను కూడా వారు అత్యంత అసభ్య పదజాలంతో దూషించారని,అంతటితో ఆగకుండా రాష్ట్ర మహిళా మంత్రి సీతక్క , స్థానిక శాసనసభ్యుడిని సైతం వారు అవమానకరంగా మాట్లాడారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తున్న సమావేశంలో సర్పంచ్ కుటుంబ సభ్యుల తీరుపై వినయ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ ఘటనపై వెంటనే స్పందించిన బాధితుడు వినయ్ పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు,నర్ల పోల్ రాజ్ మరియు నర్ల సాయిలపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వినయ్ తెలిపారు.ప్రజా ప్రతినిధులపై దాడులకు పాల్పడటం,అధికారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని,ఇలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని బోలం వినయ్ డిమాండ్ చేశారు.

## నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు

### అధిక ఫీజుల వసూలుపై ఎంఇఒ చర్యలు తీసుకోవాలి

### బుక్స్ అమ్ముతూ విద్యను వ్యాపారంగా మార్చారు: బిఆర్ఎస్‌వి



**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలో పలు ప్రైవేట్ పాఠశాలలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని, విద్యాసంస్థలను వ్యాపార కేంద్రాలుగా మార్చేశారని బిఆర్ఎస్‌వి నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్ కుమార్ విమర్శించారు. శనివారం ఆయన స్థానిక ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. పట్టణంలోని కొన్ని పాఠశాలలు షిఫ్టింగ్ పర్మిషన్ (తరలింపు అనుమతులు) లేకపోయినప్పటికీ యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నాయని మండిపడ్డారు. విద్యను వ్యాపారంగా మారుస్తూ పాఠశాలల్లోనే పుస్తకాలను విక్రయిస్తున్నారని ఆరోపించారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన సంస్థలు.. ఒక్కో విద్యార్థి నుండి రూ. 25,000 నుండి రూ. 1 లక్ష వరకు భారీగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్రంగా మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై వెంటనే మండల విద్యాశాఖ అధికారి (ఎంఇఒ) స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు రెండుసార్లు ఎంఇఒ కార్యాలయానికి వెళ్లినప్పటికీ అధికారి అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్‌వి నాయకుడు లింగం రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## వరి తర్వాత పెసర సాగు: రైతుకు అదనపు ఆదాయం

### భూమికి సహజ ఎరువు!

### ఎరువుల ఖర్చు తగ్గుతుందంటున్న ఎఇఒ శశిధర్



**ప్రజాపక్షం/ముత్తారం :** రైతులు సంప్రదాయ పద్ధతుల్లోనే కాకుండా మేలైన పంట మార్పిడి విధానాలను పాటిస్తే అటు అదనపు ఆదాయంతో పాటు ఇటు పెట్టుబడి ఖర్చులను కూడా తగ్గించుకోవచ్చని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యవసాయ విస్తరణ అధికారి శశిధర్ తెలిపారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని మచ్చుపేట గ్రామానికి చెందిన ఒక రైతు వరి కోతల అనంతరం తన పొలంలో వెంటనే పెసర పంటను సాగు చేశారు.ఈ సందర్భంగా ఎఇఒ శశిధర్ మాట్లాడుతూ..వరి పంట తర్వాత పెసర లాంటి పప్పు దినుసుల పంటలను సాగు చేయడం వల్ల రైతులకు తక్కువ కాలంలోనే అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. అంతేకాకుండా,పెసర కోతల అనంతరం ఆ చెట్లను భూమిలోనే వేసి దున్నడం (పచ్చిరొట్ట ఎరువుగా మార్చడం) వల్ల భూమికి నత్రజని (నైట్రోజన్) లభ్యత పెరుగుతుందని పేర్కొన్నారు.దీనివల్ల తదుపరి వేసే పంటకు రసాయనిక ఎరువుల వాడకం,పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గుతుందని వివరించారు.పంట మార్పిడి విధానాన్ని పాటించిన మచ్చుపేట రైతును ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఇతర రైతులు కూడా ఈ విధానాన్ని అవలంబించాలని ఎఇఒ కోరారు.

## 'సర్'ప్రక్రియ వేగవంతం

### మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ అన్నారు. శనివారం రోజున వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో గల 17 వ వార్డు సందర్శించి నూతనంగా వేయబడుతున్న రోడ్లను పరిశీలించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్థానిక సానిటేషన్ సమస్యలను గుర్తించి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.ఆ తరువాత 17వ వార్డులో జరుగుతున్న ఎస్ ఐఆర్ (SIR ) ప్రక్రియను పరిశీలించారు.తదనంతరం కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్, ఎన్యుమేషన్ ఫామ్ పంపిణీ వేగవంతం చేయాలని బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు.ఓపెన్ ప్లాట్ల లో చెత్త వేయకుండ యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.లేనిచోట ప్రకారమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఫణీంద్ర భూపతి,మున్సిపల్ సిబ్బంది రమాకాంత్, చరణ్,అరవింద్ ,రాజు,అనిల్,స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఎదుగుదలను ఓర్వలేకే మాజీ ఎంపిపి చంద్రయ్య కుట్రలు

### మల్కపేట సర్పంచ్ బోయిని దేవరాజు కీలక వ్యాఖ్యలు



**ప్రజాపక్షం/ వేములవాడ / కోనరావుపేట :** కోనరావుపేట మండలంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ధాన్యం అక్రమ రవాణా వ్యవహారం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర సవాల్ ప్రతిసవాళ్లకు దారితీసింది. రాజకీయ దురుద్దేశంతో, ఒక యువకుడిగా తాను ప్రజల్లో ఎదుగుతుండటాన్ని ఓర్వలేకనే బిఆర్ఎస్ నేత, మాజీ ఎంపిపి చంద్రయ్య తనపై కుట్రలు పన్నుతూ అసత్య ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కోనరావుపేట మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, మల్కపేట గ్రామ సర్పంచ్ బోయిని దేవరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు చెలిమెడ లక్ష్మీ నరసింహారావు సొంత గ్రామంలో తాను కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్‌గా గెలుపొందడాన్ని జీర్ణించుకోలేకనే స్థానిక బిఆర్ఎస్ నాయకులు తనను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు.

## మిస్సింగ్ కేసు నమోదు

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 24 న కల్వచర్ల గ్రామానికి చెందిన బొంత సాయమల్లు(40) అనే వ్యక్తి మధ్యాహ్నం 3 గంటలకు ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు తన భార్య చూసి చుట్టు పక్కల, బంధువుల దగ్గర తెలుసుకున్న ఎక్కడికి రాలేదని తెలపడంతో సాయమల్లు భార్య రజిత పిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది.అతని వివరాలు తెలిస్తేమంధనిసిఐ 8712656528, రామగిరి ఎస్ఐ8712656532 నంబర్ లకు సమాచారం తెలపాలని కోరారు.

# ఉచ్చమల్ల వాగు శిఖం భూములకు ఎసరు

రాత్రి వేళ ట్రాక్టర్లతో దున్నుతున్న కబ్జాదారులు

అధికారుల తీరుపై మత్స్యకారుల ఆగ్రహం



**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట్ మండలం చేడ్వాయి పరిధిలోని ఉచ్చమల్ల వాగు జలాశయం శిఖం భూములు అక్రమార్కుల పాలవుతున్నాయి. కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగు పనులు చేపడుతుండటంతో మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఎనిమిది ఎకరాల ఆక్రమణ

గ్రామానికి చెందిన వరిమడ్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు సుమారు ఎనిమిది ఎకరాల వరకు శిఖం భూమిని ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ విషయమై మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శిఖం భూముల్లో ఎలాంటి ఆక్రమణలు చేయరాదని అప్పట్లో అధికారులు చెప్పడంతో పనులు ఆపిన వారు, ఈ ఏడాది మళ్లీ యథేచ్ఛగా సాగు ప్రారంభించారు. శుక్రవారం రాత్రి శిఖం భూమిలో కబ్జాదారులు ట్రాక్టర్‌తో దున్నుతుండగా మత్స్యకార సంఘ సభ్యులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. వెంటనే తహసీల్దార్ కార్యాలయంతో పాటు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. అయినప్పటికీ ఏ ఒక్క అధికారి స్పందించకపోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కలెక్టర్ చొరవ తీసుకోవాలి

ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్లే ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారని మత్స్యకారులు విమర్శిస్తున్నారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని కోరుతున్నారు. సర్వే నిర్వహించి ఆక్రమణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. శిఖం భూములను వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు స్పష్టం చేస్తున్నారు.

## జులై 4 లోపు రైతు భరోసా దరఖాస్తులు చేసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి గుర్రం ఆనంద్ రావ్

**ప్రజాపక్షం / జైనూర్ :** జులై 4వ తేదీలోపు అర్హులైన రైతులు తప్పనిసరిగా రైతు భరోసా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని జైనూర్, సిర్పూర్ (యూ) మండల వ్యవసాయ అధికారి గుర్రం ఆనంద్ రావ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది కొత్తగా పట్టాదార్ పాస్‌బుక్ పొందిన రైతులందరూ ఈ పథకానికి అర్హులని తెలిపారు. రైతులకు సాగు ప్రారంభానికి పెట్టుబడి సాయం అందించి అప్పుల భారం తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. అర్హులైన వారు దరఖాస్తుతో పాటు కొత్త పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులను జులై 4లోపు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు స్వయంగా సమర్పించాలని కోరారు. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తులు స్వీకరించబోమని, చివరి తేదీ వరకు వేచి చూడకుండా రైతులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

## రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

సర్పంచ్ కావుడే బిక్కు పటేల్



**ప్రజాపక్షం/కౌటాల :** మండలంలోని నాగేపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ కావుడే బిక్కు పటేల్ ఆధ్వర్యంలో రైతు భరోసా పథకానికి కొత్తగా వచ్చిన దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించారు. కౌటాల రైతు వేదికతో పాటు వీరవెల్లి, గుండాయిపేట్ గ్రామాల్లో కూడా వ్యవసాయ విస్తరణ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. జూన్ 15 వరకు పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు ఈ పథకానికి అర్హులని, జూలై 5లోపు దరఖాస్తులు సమర్పించాలని అధికారులు తెలిపారు. దరఖాస్తుకు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులు, దరఖాస్తు ఫారం సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు అంజన్న, ఘన్‌శ్యామ్, రాజేశ్వర్, కల్పన, రైతులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో కాంగ్రెస్ పార్టీ సర్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్) పై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి కూచాడి శ్రీహరిరావు శనివారం క్యాంప్ ఆఫీస్‌లో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరై ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఈ సదస్సు ద్వారా ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, సవరణలపై పార్టీ శ్రేణులకు స్పష్టత కల్పించనున్నట్లు తెలిపారు.

## విద్యానగర్‌లో ముమ్మరంగా నాలాల పూడికతీత

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ వార్డుల్లో మురికి కాలువలు, నాలాల పూడిక తీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శనివారం 14వ వార్డు పరిధిలోని విద్యానగర్‌లో రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మున్సిపాలిటీ పనులను వేగవంతం చేసింది. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణ కల్పించడమే లక్ష్యంగా మున్సిపల్ సిబ్బంది నిరంతరం పనిచేస్తున్నట్లు వైస్ చైర్మెన్ తెలిపారు.

## విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

జన్నారం సబ్ ఇన్‌స్పెక్టర్ జి. ఉదయ్ కిరణ్



**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్ను శనివారం జన్నారం సబ్ ఇన్‌స్పెక్టర్ జి. ఉదయ్ కిరణ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్ నిర్వాహకులు ఆడేపు లక్ష్మీ నారాయణ, వారి కుమారుడు సాయికిరణ్ను సబ్ ఇన్‌స్పెక్టర్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని విద్యార్థులు ఈ ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. స్థానికంగానే కాకుండా పరిసర మండలాల విద్యార్థులు కూడా ఇక్కడ శిక్షణ పొంది వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, పొనకల్ ఉపసర్పంచ్ అప్పాల జలపతి, బీసీ నాయకులు కోడూరి చంద్రయ్య, కడార్ల నరసయ్య, కాంగ్రెస్ నాయకుడు ముజఫర్ అలీ ఖాన్, బిజెపి మండల అధ్యక్షుడు జి. మధుసూదన్ రావు, బిఆర్ఎస్ నాయకులు సిటీ మల్ల భరత్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, బేసిక్స్ రాజు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాజుల లింగన్న, రిపోర్టర్లు కందుల రమేష్, జాడి వెంకటి, పద్మశాలి పట్టణ సంఘం అధ్యక్షుడు చెట్పల్లి కృష్ణ, బాలిన మధు, తాళ్లపల్లి రాజేశ్వర్, కొండకూరు ప్రభాస్, బొట్ల సంజీవ్, తోకల విశేష్, జక్కుల సురేష్, లసెట్టి సత్యనారాయణ, ఎస్. గోపాల్, రాంపూర్ మల్లేష్ పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో నూతన క్రేన్ ప్రారంభం

ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని వర్క్‌షాప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 12 టన్నుల సామర్థ్యం గల క్రేన్‌ను శనివారం ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పూజా కార్యక్రమం అనంతరం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత పెంపులో వర్క్‌షాప్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. భూగర్భ, ఉపరితల గనులకు అవసరమైన యంత్రాల నిర్వహణ, మరమ్మతులు సకాలంలో పూర్తి చేసి ఎలాంటి జాప్యం లేకుండా గనులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, ఉద్యోగులకు సూచించారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన 12 టన్నుల క్రేన్‌తో పాటు ఇతర భారీ యంత్రాలు, వాహనాలను సమర్థవంతంగా వినియోగించి నిర్వహణ పనులను మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు. యంత్రాల పనిగంటలను పెంచి సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, డీజీఎం (వర్క్‌షాప్) కృష్ణారెడ్డి, డీవై సీఎంఓ రమేష్ బాబు, పిట్ సెక్రటరీ సదానందం, సంక్షేమ అధికారి రమేష్ నాయక్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## జిఎం పి. రాజీవ్ కుమార్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం / మందమర్రి :** సింగరేణి సంస్థలో సుదీర్ఘకాలం సేవలందించి త్వరలో పదవీ విరమణ చేయనున్న జీఎం (విజిలెన్స్–కార్పొరేట్) పి. రాజీవ్ కుమార్ను శనివారం మందమర్రి ఏరియాలో ఘనంగా ఆత్మీయ సన్మానం నిర్వహించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ పి. రాజీవ్ కుమార్ తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ విజిలెన్స్ విభాగానికి విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. సంస్థ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా ఈ అండ్ ఎం బాలాజీ భగవతి జా, డీజీఎం (ఐఈడీ) కె. కిరణ్ కుమార్, డీవైజీఎం (ఏఎస్ఓటు)మురళి, డీజీఎం (సర్వే) భుఖ్య దేశాయ్, డీజీఎం (సివిల్) షేక్ మదీనా భాషా, ఫారెస్ట్ అధికారి నవీన్, క్వాలిటీ అధికారి ప్రదీప్, డీజీఎం (పర్సనల్) విజయ్ సందీప్, ఎస్. రాజ్ కుమార్, మేనేజ్‌మెంట్ ట్రైనీ (అకౌంట్స్) పాల్గొన్నారు.

## బిసి కాలనీలో నూతన బోర్ ఏర్పాటు

**ప్రజాపక్షం/ పెంచికల్ పేట్ :** పెంచికల్ పేట్ గ్రామపంచాయతీ పరిధిలోని బిసి కాలనీలో గ్రామ సర్పంచ్ షేక్ ఉస్మాన్ ఆధ్వర్యంలో శనివారం నూతన బోర్ వేయించారు. కాలనీలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈ బోర్‌ను ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో రోజులుగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులకు ఈ బోర్ ద్వారా స్వచ్ఛమైన నీరు అందుబాటులోకి రానుంది. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించి బోర్ ఏర్పాటు చేయించిన సర్పంచ్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యను పరిష్కరించి తాగునీటి సౌకర్యం కల్పించిన గ్రామపంచాయతీ పాలకవర్గానికి ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామాభివృద్ధి కోసం సర్పంచ్ కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు.

# కుంటాల ఎస్‌సి బాలుర హాస్టల్‌ను వెంటనే పునఃప్రారంభించాలి



ప్రజాపక్షం / కుంటాల : మండల కేంద్రంలో గతంలో విజయవంతంగా నిర్వహించబడిన ఎస్సీ సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని అధికారులు నిర్లక్ష్యంగా మూసివేయడం అత్యంత బాధాకరమని చాత్ర యువ సంఘర్ష సమితి (CYSS) నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుంటాల మండల కేంద్రంలో ప్రభుత్వ మోడల్ స్కూల్‌తో పాటు పలు విద్యా సంస్థలు ఉండటంతో ప్రతి సంవత్సరం వందలాది మంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు విద్యాభ్యాసం కోసం ఇక్కడికి వస్తున్నారని, అయితే ఈ హాస్టల్ మూతపడటం వల్ల పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వసతి సౌకర్యాలు లేక అనేక మంది విద్యార్థులు చదువును మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని మరి కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్ళి చదువుకోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మండల కేంద్రంలో ఉన్న బీసీ హాస్టల్‌లో సీట్లు పూర్తిగా నిండిపోయాయయని దాదాపు 100 మంది విద్యార్థులకు మాత్రమే అక్కడ అవకాశం ఉండటంతో మిగిలిన విద్యార్థులు వసతి కోసం అల్లాడుతున్నారని అరవింద్ తెలిపారు. విద్యార్థులు రావడం లేదనే సాకుతో గతంలో సక్రమంగా నడిచిన ఎస్సీ సంక్షేమ శాఖ వసతి గృహాన్ని మూసివేయడం పూర్తిగా వాస్తవ విరుద్ధమని హాస్టల్ నిర్వహణలో అధికారులు చూపిన నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి కారణాలు చూపుతున్నారని మండిపడ్డారు. నేడు వసతి గృహం అందుబాటులో ఉంటే వందలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. అందువల్ల జిల్లా కలెక్టర్, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు వెంటనే స్పందించి కుంటాల మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ శాఖ బాఇలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. హాస్టల్‌కు అవసరమైన సిబ్బందిని కేటాయించి, మౌళిక వసతులు కల్పించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. లేనిపక్షంలో ఛాత్ర యువ సంఘర్షన సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడే అధికారుల నిర్లక్ష్య వైఖరినీ ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని శీతల్కర్ అరవింద్ స్పష్టం చేశారు.

# పోలియో చుక్కల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ప్రజాపక్షం / భైంసా : ఈ నెల 28న చేపట్టే పోలియో చుక్కల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పవార్‌రామారావు పటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలోని తన నివాసంలో ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతీ చిన్నరికి చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో వ్యాధి రాకుండా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో బాధ్యతగా తల్లిదండ్రులు చిన్నారులకు డ్రాప్స్ వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల కార్యదర్శి చింతలబోరి సర్పంచ్ పండిత్ రావు పటేల్, వైద్యులు పాల్గొన్నారు.

# వెంగ్వాపేట్ శివార్లలో రోడ్డు ప్రమాదం

ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ : నిర్మల్ మండల పరిధిలోని వెంగ్వాపేట్ గ్రామం శివార్లలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఒక ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆలూరు గ్రామానికి చెందిన కొండూరు చిన్న రాజేశ్వర్ తండ్రి పోశెట్టి, వయస్సు 55 సంవత్సరాలు, తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు తక్షణమే స్పందించి బాధితుడిని చికిత్స నిమిత్త నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



# రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి




ప్రజాపక్షం / పెంబి : తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (AIUKS) ఆధ్వర్యంలో శనివారం పెంబి తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాల పంటల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు విత్తనాల కొరత, నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత, పెరుగుతున్న పెట్టుబడి భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల సమస్యలు మరింత తీవ్రతరం అవుతున్నాయని, రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, యూరియాను యాప్ ద్వారా బుక్ చేసుకునే విధానాన్ని రద్దు చేయాలని పెరుగుతున్న ఎరువుల ధరలను నియంత్రించి, రైతులకు అందుబాటు ధరల్లో సరఫరా చేయాలని కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రైతు భరోసా పెట్టుబడి సాయం సీజన్ ప్రారంభంలోనే అందించాలని, గత బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోతున్న రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని, రైతులు పండించిన ప్రతీ రకం వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, కొనుగోళ్ళపై పరిమితులు విధించవద్దని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో రైతులపై జరుగుతున్న కోతలను వెంటనే నిలిపివేయాలని, మొక్కజొన్నతోపాటు అన్ని పంటల బకాయి చెల్లింపులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేసింది. పంట మార్పిడినీ ప్రోత్సహించాలంటే అన్ని పంటలకు కనీస మద్దతు ధర MSP ప్రకారం కొనుగోలు హామీ ఇవ్వాలని, అదనపు ప్రోత్సాహకాలు ప్రకటించాలని అన్నారు. పోడు సాగుదారుల సమస్యలను పరిష్కరించి , అర్హులైన గిరిజన రైతులకు పోడు పట్టాలు ఇచ్చి భూ హక్కులు కల్పించాలని అలాగే సాధా బైనామాల ద్వారా కొనుగోళ్ళు చేసిన భూములు అన్నిటికీ పాస్ బుక్కులు అందించాలని అన్నారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని అఖిల భారత ఐక్య రైతు సంఘం (AIUKS) హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో AIUKS జిల్లా నాయకులు జక్కుల రాజన్న, నర్సింగారావు, అభీయాదవ్, మచ్చ శ్రీనివాస్, గోపాల్‌రావు, శంకర్, లక్ష్మణ్, మధు, మనోహర్ లను తదితరులు పాల్గొన్నారు.

# టిసిఏ క్రికెట్ క్యాలెండర్‌కు ఆమోదం



ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసిఏ) ప్రతిపాదించిన 202627 టీయా క్రికెట్ క్యాలెండర్ భారత క్రికెట్ క్యాలెండర్ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ఆమోదానికి సిద్ధమైంది. ఈ సీజన్లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 210 అంతర్ జిల్లా లీగ్ మ్యాచులు నిర్వహించనున్నట్లు టీసిఏ నిర్మల్ జిల్లా కోచ్ రామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 సీనియర్ జిల్లా జట్లతో పాటు మహిళలు, అండర్ 23, అండర్ 19, అండర్ 16, విభాగాల్లోనూ పోటీలు నిర్వహించనున్నారు. క్రికెట్ ప్రతిభను వెలికితీయడం, యువ క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించడం లక్ష్యంగా క్యాలెండర్‌ను రూపొందించినట్లు చెప్పారు. టీయా ట్రోఫీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు తెలంగాణ ప్రీ మియర్ లీగ్‌జట్లలో చోటు కల్పిస్తామని, బిసిసిఐ నిర్వహించే దేశీయ టోర్నీల్లో పాల్గొనే అవకాశాలు కూడా లభిస్తాయని వెల్లడించారు.

# దిలావర్‌పూర్‌లో నేటి నుండి పల్స్ పోలియో

ప్రజాపక్షం / దిలావర్‌పూర్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, మండల వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం జూన్ 28 నుండి 30 వరకు మూడు రోజుల పాటు నిర్వహించబడుతుందని తెలిపారు. జూన్ 28 ఆదివారం రోజున బూత్ లెవెల్ కార్యక్రమం ఉంటుందని ఈ రోజున తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో బూత్‌కు వెళ్ళి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. జూన్ 29,30 తేదీల్లో వైద్య సిబ్బంది నేరుగా ఇంటింటికి సదర్శించి, మొదటి రోజు బూత్‌లో చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేస్తారని వివరించారు. ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించి, తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి అంగవైకల్యం నుండి రక్షణ పొందాలని కోరారు.

# రైతు భరోసాకు వేళాయే ! ఈ నెల 30న పెట్టుబడి సాయం!

ప్రజాపక్షం / నిర్మల్ : వానాకాలం సాగు పనులు ఊపందుకున్న నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను ఈ నెల 30న విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో కొనసాగిస్తోంది. అయితే ప్రభుత్వం మారిన తర్వాత నిధుల విడుదలలో జాప్యం , విడతల వారి చెల్లింపులు, పరిమిత ఎకరాలకు మాత్రమే సాయం అందించడం వంటి కారణాలతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సారి మాత్రం వానాకాలం సాగును దృష్టిలో ఉంచుకుని అర్హులైన రైతులందరికీ పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయాధారిత జిల్లాగా పేరుగాంచిన నిర్మల్ జిల్లాలో ప్రస్తుతం వరి, పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, కంది తదితర పంటల సాగు జోరుగా కొనసాగుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇందనం, కూలీల ఖర్చులు గణనీయంగా పెరగడంతో రైతులపై ఆర్థిక భారం పెరిగింది. ఈ పరిస్థితుల్లో రైతు భరోసా నిధులు సకాలంలో అందితే సాగు పెట్టుబడికి ఊరట లభించడంతో పాటు అప్పులు చేయాల్సిన అవసరం కూడా కొంత మేర తగ్గుతుందని రైతులు ఆశిస్తున్నారు. నిర్మల్ జిల్లాలో సుమారు 2.25 లక్షలకు పైగా రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. నిర్మల్, భైంసా, ముథోల్, ఖానాపూర్, కుబీర్, దిలావర్‌పూర్, లక్ష్మణ చాంద, మామడ, సోన్, సారంగాపూర్, పెంబి, కడెం, దస్తూరాబాద్ లోకేశ్వరం, తానూర్, బాసర, నర్సాపూర్ (జి) మండలాల్లో లక్షల ఎకరాల్లో పంటల సాగు జరుగుతోంది. ప్రభుత్వం పూర్తి స్థాయిలో రైతు భరోసా అమలు చేస్తే జిల్లాలో రూ. 300 కోట్లకు పైగా పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఆధార్ అనుసంధానం, భూ రికార్డులలో లోపాలు లేని అర్హులైన రైతులకు నిధులు నేరుగా జమయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఈ సారి రైతు భరోసా మొత్తాన్ని విడతల వారిగా కాకుండా ఒకేసారి రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం




గతంలో విడతలుగా నిధులు విడుదల కావడంతో రైతులు ఇబ్బందులు, ఎదుర్కొన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే రైతులకు ఉన్న మొత్తం సాగు భూమికి సాయం అందిస్తారా ? లేక ఏడున్నర ఎకరాల వరకు మాత్రమే పరిమితం చేస్తారా ? అనే అంశంపై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. రైతు భరోసా నిధుల విడుదలపైనే ఉంది. ప్రభుత్వం ప్రకటించిన తేదీ ప్రకారం ఈ నెల 30న నిధులు విడుదలై అర్హులైన రైతుల ఖాతాల్లో జమైతే నిర్మల్ జిల్లాలో లక్షలాది మంది రైతులకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది.

# నూతన ఎం.పిడి.ఓ. రాజశేఖర్‌కు సన్మానం



ప్రజాపక్షం / పెంబి : మండల నూతన ఎంపిడీవో వెంకట రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో ఎంపిఓగా విధులు నిర్వహించి పదోన్నతిపై పెంబికి ఎంపిడీఓగా బాధ్యతలు గురువారం చేపట్టడం తో గురువారం పెంబి సర్పంచ్ మల్లపల్లి సత్యనారాయణ స్వామి, పెంబి తండా సర్పంచ్ గంగాధర్, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు నల్ల స్వప్నల్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ , మండల అధ్యక్షులు నరేష్ తదితరులు ఉన్నారు.

# ఫాసిస్టు పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వం

**ప్రజాపక్షం/నిజామాబాద్:** ఆదర్శ కమ్యూనిస్టు కార్మికవర్గ పోరాట యోధుడు కా॥ డివి.కృష్ణ 4వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రేడియో స్టేషన్ ఎదురుగా గల డివికె నగర్ వద్ద కా॥ డివి కృష్ణ స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యురాలు కా॥ రమ ఆవిష్కరించగా పార్టీ శ్రేణులు డివికె స్థూపం వద్దనివాళులర్పించారు. అనంతరం పార్టీ అర్బన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అధ్యక్షతన న్యూ అంబేద్కర్ భవన్‌లో జరిగిన స్మారకోపన్యాసాల కార్యక్రమంలో 'ఆర్థిక సంక్షోభం ప్రజలకు సవాళ్లు', దేశంలో పెరుగుతున్న ఫాజిజం, 'డివికె సిద్ధాం రాజకీయ కృషి' అంశాలపై వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ నాయకులు కేజీ రామచందర్, కె. రమ మాట్లాడుతూ దేశంలో ప్రపంచంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం తలెత్తుతుందన్నారు. సామ్రాజ్యవాదులు యుద్ధాలను ప్రజల నెత్తి మీద రుద్ది, భారాలను విధ్వంసాలను మిగుల్చుతున్నారన్నారు. బడా కార్పోరేట్ కంపెనీల లాభాల కోసం ప్రపంచం, దేశం దాసోహం అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశంలో మోడీ 12 ఏళ్ల పాలన రాజ్యాంగ మౌలిక వ్యవస్థలన్నింటిని లోబర్చుకుందన్నారు. మత ప్రాతిపదికన ఫాసిజానికి రోడ్డు నిర్మించిదన్నారు. ముస్లింలను ఇతర మతాలనే కాకుండా కమ్యూనిస్టులను, విప్లవకారులను చివరికి ప్రతిపక్షాలను నిర్మూలించాలనే వైఖరిని మోడీ ప్రభుత్వం చేపట్టిందని ఆరోపించారు. మరోవైపు ప్రజల హక్కులన్నింటిని హరిస్తుందన్నారు. కార్మిక, రైతాంగ, యువజన, మహిళలు, దళితులు అన్ని వర్గాల ప్రజల జీవితాలను దుర్భరం చేసిందన్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్ఎస్ఎస్ బీజేపీ మోడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ అనివార్యంగా వీధుల్లోకి రావల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణమే ఈ ఫాసిస్టు ప్రభుత్వానికి విరుడవుతుందన్నారు. ప్రజలను ఆ వైపుగా మరింత చైతన్యం చేసినప్పుడే కా॥ డివి కృష్ణకు నిజమైన నివాళి అవుతుందన్నారు. కార్యక్రమంలో అరుణోదయ కళాకారులు పాటలతో చైతన్యం చేశారు. పార్టీ సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్,




రాష్ట్ర నాయకులు నరేందర్, రామకృష్ణ, డివి.కృష్ణ సోదరులు చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వెంకన్న, రాజేశ్వర్, దేవరాం, గంగాధర్, ముత్తెన్న, రవీందర్, సుధాకర్, మల్లేష్, కిషన్, రమేష్, మురళి, రాజేశ్వర్, సత్తెక్క, వివిధ ప్రజా సంఘాల నాయకులు గోదావరి, సంధ్యారాణి, గణేష్, అనిల్, సురేష్, నవీన్, సాయిబాబా, నారాయణ, కిరణ్, సాయరెడ్డి, బీకసింగ్, అమూల్య, పద్మ, అషూర్, నసీర్, లింగం, వినోద్, సురేష్ పాల్గొన్నారు.

## సర్ సర్వే పత్రాలను అందించిన మాజీ ఎమ్మెల్యే యెండల



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్:** ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామ్య దేశం అయిన మన భారతదేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీ తనాన్ని మరింత పటిష్టవంతంగా అమలు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ సర్వేలో ప్రతి ఓటరు పాల్గొని ఎన్నికల సంఘం ప్రతినిదులు అడిగిన వివరాలను అందజేయాలని బిజెపిసీనియర్ నాయకులు, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మి నారాయణ అన్నారు. శనివారం ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా నగరంలోని శ్రీనగర్ కాలనీలోగల తన నివాసానికి విచ్చేసిన ఎన్నికల సంఘం ప్రతినిధులకు వ్యక్తిగత, కుటుంబ ఓటు వివరాలు అందజేశారు. కార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్రనాయకులు స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడే చిన్నారులకు పోలియో చుక్కలు వేయించండి

### డాక్టర్ అమరేందర్ రావు



**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో నేడు ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ అమరేందర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు వయసున్న చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ కోరారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పెంబట్లలో మొహరం సంబరాలు

### ఆకట్టుకున్న పులి వేషాలు

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామంలో మొహరం సంబరాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పీరీల ఊరేగింపులో పెద్ద ఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొని ఉత్సాహంగా సందడి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొలపాక రాధ రాజు మాట్లాడుతూ ఈ పీరీల పండుగ హిందు ముస్లింల స్నేహానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొలపాక రాధా రాజు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పెద్ద మనుషులు, ప్రజలు పాల్గొన్నారు.



## జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వసతులను పెంచాలి

**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా బోధన్ లోని జిల్లా ఆస్పత్రిలో వసతులను పెంచాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బోధన్ జిల్లా ఆస్పత్రిని సందర్శించి, సమస్యలను అధ్యయనం చేసి వైద్యులతో మాట్లాడారు. అంతకుముందు వివిధ వార్డులో ఉన్న రోగులను వారి సమస్యలను సిపిఎం నాయకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ బాబు మాట్లాడుతూ.. బోధన్ ఏరియా ఆస్పత్రి ను జిల్లా ఆస్పత్రిగా మార్చినప్పటికీ కనీసం ఏరియా ఆస్పత్రిలో ఉండే వైద్య సిబ్బంది కూడా లేకపోవడం వలన హాస్పిటల్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రైవేట్ హాస్పిటల్ కు లేదా జిల్లా కేంద్ర ఆస్పత్రికి పంపుతున్నారని ఆస్పత్రికి వచ్చే పేద మధ్య తరగతి మహిళలు గర్భిణీలు, బాలింతలకు వైద్య చికిత్స అందించడానికి గైనకాలజిస్ట్ లేరని అదేవిధంగా, ఎముకల డాక్టర్లు లేరని కనీసం స్కానింగ్ తీయడానికి టెక్నిషియన్ లేరని అందువల్ల వచ్చిన రోగులకు కూడా అనేక మందికి కొన్ని మందులు ఇచ్చి పంపించేస్తున్నారని దాని మూలంగా అనేక మంది రోగాలు ప్రైవేట్ హాస్పిటల్ వెళ్లి లక్షల రూపాయాలు ఖర్చులు పెట్టి అప్పుల పాలవుతున్నారని ఆయన అన్నారు. బోధన్ నియోజకవర్గం నుంచి ఎన్ని



కైన స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి క్యాబినెట్ ర్యాంకుతో ప్రభుత్వ సలహాదారులుగా ఉన్నప్పటికీ జిల్లా ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలని కల్పించడంలో తగినంత వైద్య సిబ్బందిని నియమించడంలో నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా వెంటనే జిల్లా ఆస్పత్రి స్థాయిని పెంచడంతో పాటు వైద్య సిబ్బందిని టెక్నిషియన్లను మందులను సరిపడా ఏర్పాటు చేయాలని, లేని ఏడల ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఏరియా కార్యదర్శి శంకర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు వేషాల గంగాధర్, జంగం గంగాధర్, నాయకులు రాములు, నాగలక్ష్మి , అర్జున్ తదితరులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకుడు

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో శనివారం పలు వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు స్వర్ణకారుల మండల అధ్యక్షుడు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకోజు అశోక్ చారి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన సోమిడి రామప్రభాకర్ దంపతుల కుమార్తె అక్షయరాజ్ కుమార్ వివాహం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆకోజ్ అశోక్ చారి నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి, అక్షింతలు వేసి ఆశీర్వదించారు.అదేవిధంగా,కేషనపల్లి గ్రామానికి చెందిన సింగనవేన సునీతసమ్మయ్య దంపతుల కుమారుడు రాజ్ కుమార్ వివాహం ముత్తారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటలక్ష్మి గార్డెన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు.మండల అధ్యక్షుడు అశోక్ చారి హాజరై నూతన వధూవరులు రాజ్ కుమార్ శ్రావణి లను ఆశీర్వదించి,వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు.



## తహసీల్దార్ ఎదుట ఐదుగురు నాటుసారాయి విక్రేతల బైండోవర్

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో గతంలో నాటుసారాయి విక్రయిస్తూ పట్టుబడిన ఐదుగురు వ్యక్తులను శనివారం తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు మంథని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తెలిపారు.అధికారుల వివరాల ప్రకారం, మండలంలోని అడవిశ్రీరాంపూర్,సర్వారం,ఖమ్మంపల్లి,పోతారం గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు గతంలో నాటుసారాయి అమ్ముతూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు.ఈ నేపథ్యంలో వారి ప్రవర్తనలో మార్పు కోసమే కాకుండా, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా శనివారం వారిని ముత్తారం తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు. ఏడాది కాలం పాటు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడబోమంటూ ఒక్కొక్కరు లక్ష రూపాయల జమానత్‌తో తాసిల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా తాసిల్దార్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మంథని ఎక్సైజ్ ఎస్సై సాయి కుమార్,ట్రైనింగ్ ఎస్సై సంతోష్,ఎక్సైజ్ సిబ్బంది భగవాన్ నాయక్,సునీల్,రవి,తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ, ర్యాలీ




**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ :** రూరల్ పరిధిలోని డిచ్‌పల్లి టియు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద ఎన్ఎస్ఎస్ యూనిట్ 4 ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని సుద్దపల్లి గ్రామంలో డ్రగ్స్ లేని యువత డ్రగ్స్ లేని సమాజం అనే నినాదంతో భారీ డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్లకార్డులు, విద్యార్థులు బ్యానర్లు చేతబట్టి డ్రగ్స్ వద్దు బతుకు ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ప్రధాన వీధులు, బడి వద్ద ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పానుగంటి రూప, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు నర్సయ్య, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజమే మన అందరి లక్ష్యం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నుండి పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించామని జిల్లా వైద్యాధికారిని రాజశ్రీ తెలిపారు. ఈ అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ కలెక్టర్, స్థానిక సంస్థలు భుజంగరావు జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించి మాటాల్డారు. చిన్నారులందరికి ఇంటింటికి తిరుగుతూ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ అశోక్, వైద్యులు రాములు, సికిందర్‌నాయక్, వెంకన్న, నవ్య, వెంకటేష్, అజ్మతునిస్న, సుసేన, ప్రత్యూష, ప్రతాప్, రాజేశ్వర్, డిప్యూటీ డెమో దుర్గారావు, డీహెచ్ఈలు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, మనోహర్, సలీం, హెచ్ఈఓలు గోవర్ధన్, నాగరాజు, వెంకట్‌రవి, లింబారెడ్డి, శంకర్, రవిచందర్, శాంతకుమారి, అధికారులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.



## జిల్లాలోనే మొట్టమొదటి స్పేస్ ల్యాబ్ ప్రారంభించిన పారమిత

**ప్రజాపక్షం / కొత్తపల్లి:** పాఠశాల విద్యారంగంలో ఒక సరికొత్త మైలురాయిని అధిగమిస్తూ నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల అత్యాధునిక పారమిత స్పేస్ ల్యాబ్ ను శనివారం ప్రారంభించింది. పాఠశాల స్థాయిలో అంతరిక్ష విద్యను పరిచయం చేసిన మొట్టమొదటి విద్యా సంస్థగా పారమిత హెరిటేజ్ పాఠశాల కరీంనగర్ జిల్లాలోనే సరికొత్త చరిత్ర సృష్టించింది. ల్యాబ్ ప్రారంభం విద్యార్థులలో భవిష్యత్‌కు అవసరమైన శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడానికి ప్రయోగాత్మక అభ్యాసాన్ని అందించడానికి ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. విద్యార్థులలో చిన్న వయస్సు నుంచే ఉత్సుకతను రేకెత్తించడానికి ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించడానికి ఈ స్పేస్ ల్యాబ్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపికృష్ణ, డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, రాకేశ్, అనూకర్ రావు, వినోద్ రావు, ప్రసాద్ హన్మంతరావు, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 16వ వార్డులో అభివృద్ధి, ప్రజారోగ్య కార్యక్రమాలు పరిశీలన

**ప్రజాపక్షం /మెట్‌పల్లి:** మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో జరుగుతున్న వాటర్ సప్లై పైప్‌లైన్ మరమ్మత్తు పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు.పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం వార్డులో చేపట్టిన ప్రత్యేక ఓటరు పరిశీలన (ఎన్యుమరేషన్) ఫారాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.తదుపరి 16వ వార్డులో కొనసాగుతున్న ఫీవర్ సర్వేను పరిశీలించి,జ్వర లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రజల్లో అప్రమత్తత కల్పించాలని సిబ్బందికి సూచించారు. 16వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి అరిసె వనజ, డిఇనాగేశ్వరరావు,శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్,విష్ణు,ముజీబ్,నరసయ్యతో పాటు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సంజయ్ అండతో స్వగ్రామానికి నాగరాజు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** రాఘవపేట గ్రామానికి చెందిన చిట్యాల నాగరాజు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన బెహరన్ వెళ్లి ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకొని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నాగరాజుకు అండగా నిలిచారు.కంపెనీ వీసా పై వెళ్లి ఇబ్బందులు పడుతున్న నాగరాజు స్వగ్రామానికి రావడనికి సైతం ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో రాఘవపేట బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్వగ్రామానికి రావడానికి అయ్యే విమాన ఖర్చులకు 30000 నగదును బాధిత కుటుంబానికి అందించి అండగా నిలిచారు.కాదా శనివారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు నాగరాజు కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మద్దెల నరసయ్య, మాజీ ఉపసర్పంచ్ అమీనుద్దీన్, బి.ఆర్.ఎస్వి వర్గ నాయకుడు బైర రవికుమార్ యాదవ్, సిద్ధు రాజ్ కుమార్ నరసయ్య ,బైరి రాకేష్ ,దేవన్న ,మీనయ్య, స్వామి,న్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం



**ప్రజాపక్షం/కమలాపూర్:** ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే పారిశుద్ధ్య పరిరక్షణతో పాటు గ్రామాభివృద్ధి సాధ్యం అవుతుందని కమలాపూర్ గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ అన్నారు. స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా ఊరికోసం ఒక్కరోజు శ్రమదానం కార్యక్రమంలో భాగం గా సర్పంచ్ పబ్బు సతీష్, వార్డు సభ్యులు శనివారం వరుసగా 8వ వారం గ్రామంలోని 6,7,8 వార్డు ల్లో శ్రమదానం నిర్వహించారు. మురికి కాలువలు, రోడ్లు శుభ్రం చేశారు. పారిశుద్ధ్య పరిరక్షణ పై వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామంలో వరుసగా ఎనిమిది వారాలుగా నిర్వహిస్తున్న ఊరికోసం ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమంకు ప్రజల నుం చి మంచి స్పందన లభించిందన్నారు. త్వరలోనే పారిశుద్ధ్య పరిరక్షణ చర్యలు పూర్తి చేసి మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాంశెట్టి రాజయ్య, మౌటం నాగరాజు, ఓస్కుల కీర్తన, పుల్ల శ్రీనివాస్, ఎండబెల్లి మల్లారెడ్డి, ఆవునూరి తిరుపతి, నాయకులు మార్క అశోక్, గంధసిరి బిక్షపతి, కొండమీది రవి, మౌటం రాజు, షేక్ ఖాసీం, జన్ను బిక్షపతి, పిల్లి సతీష్, శ్రీనివాస్, యువకులు పాల్గొన్నారు.

## సాకేత హైస్కూల్ గుర్తింపు రద్దు చేయాలి



**ప్రజాపక్షం/కమలాపూర్ :** కమలాపూర్ మండలం అంబాల గ్రామంలోని సాకేత హైస్కూల్ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల పక్కనే ఇల్లు అద్దెకు తీసుకొని, బుక్ స్టాల్ పేరుతో విద్యార్థులకు పాఠశాల డైరీలు, పుస్తకాలను విక్రయిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. దీని పై ప్రశ్నించిన విద్యార్థి నాయకులతో యాజమాన్యం ఏం చేస్తారో చేసుకోండి అంటూ దరుసుగా ప్రవర్తించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల కిలోమీటర్ పరిధిలో ఎలాంటి బుక్ స్టోర్ ఉండకూడదనే విద్యాశాఖ నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారి స్పందించి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని, అక్రమ బుక్ స్టోర్ ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో డిఎస్ఏ జిల్లా నాయకులు శరత్, కమల్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## లింగాలలో విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



**ప్రజాపక్షం/ తాడ్వాయి :** తాడ్వాయి మండలం లింగాల గ్రామ పంచాయతీ పరిధిలో లింగాల గ్రామానికి చెందిన ఊకె మల్లయ్య అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. వ్యవసాయ పనుల కోసం నమ్ముకున్న ఎద్దు ఇలా విద్యుత్ షాక్‌తో చనిపోవడంతో ఆ పేద రైతు కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఈ ఘటనపై లింగాల గ్రామ పంచాయతీ సర్పంచ్ మొగిలిపెల్లి రవీందర్ వెంటనే స్పందించి బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ మాట్లాడుతూ ఊకె మల్లయ్య అత్యంత నిరుపేద రైతు అని, పశుపోషణ, వ్యవసాయంపైనే ఆయన కుటుంబం పూర్తిగా ఆధారపడి జీవిస్తోందని తెలిపారు. సాగు పనులు ముమ్మరంగా సాగుతున్న ఈ తరుణంలో దుక్కిటెద్దు మరణించడం ఆ కుటుంబానికి కోలుకోలేని దెబ్బ అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఆ పేద రైతుకు తగిన నష్టపరిహారం అందించి అన్ని విధాల ఆదుకోవాలని సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ కోరారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్



**ప్రజాపక్షం/కొండాపూర్ :** కొండాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి సర్పంచ్ గడీల శ్రీనివాస్ గౌడ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకుని పదవీ బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో మెరుగైన వెలుతురు కోసం ఆధునిక ఎల్ఈడి వీధిదీపాలను ఏర్పాటు చేసారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నేరాలు, దొంగతనాలు, ఆరికట్టాలనే ఉద్దేశ్యంతో మహిళలకు రక్షణ కల్పిస్తూ గ్రామ భద్రత కోసం, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ చేతుల మీదుగా 36 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో ప్రధాన రహదారి 350 మీటర్ల సీసీ రోడ్డును వేయించి గ్రామానికి సరి కొత్త కళ తెచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే నా లక్ష్యం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా అమలు చేస్తానని పాలకవర్గ, సభ్యులు గ్రామ ప్రజల సహకారంతో గొల్లపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా అన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వనజ శనివారం పిలుపునిచ్చారు. మండలంలోని ఐదు సంవత్సరాల లోపు 3,500 మంది చిన్నారులకు 28 పోలియో బూత్ లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు.అనంతరం సోమ,మంగళ వారాల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామని ఆమె వెల్లడించారు.

## ఇష్టారాజ్యంగా ఎరువులు అధిక ధరల విక్రయాలు..?

### పట్టించుకోని అధికారులు

### అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో ఎరువుల బ్లాక్ మార్కెట్ దందా యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా కొందరు డీలర్లు ఎరువులను గరిష్ఠ విక్రయ ధర కంటే భారీ ధరలకు అమ్ముతూ పెట్టుబడి సమయాల్లో రైతుల రక్తాన్ని పిండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, కనీస తనిఖీలు కూడా చేయడం లేదని రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. *సుమారు రూ. 1,550 బస్తా.. రూ. 2,300 కి విక్రయం!* తాజాగా ముత్తారం మండలంలోని ఓ గ్రామంలో ఉన్న ఫర్టిలైజర్ షాపులో ఈ దోపిడీ బహిర్గతమైంది. మార్కెట్లో సుమారుగా రూ. 1,450 నుండి1550 ధర పలికే 28 28 కోరమండల్ ఎరువుల బస్తాను, సదరు వ్యాపారి ఓ అమాయక రైతుకు ఏకంగా రూ. 2,300 కు విక్రయించాడు. అంటే ఒకే బస్తాపై అదనంగా రూ. 750 వసూలు చేసి పగటి దొంగతనానికి తెరలేపారు. డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇలా ఇష్టారాజ్యంగా ధరలు పెంచేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, వ్యాపారులు కుమ్మక్కు కావడం వల్లే ఈ అక్రమ విక్రయాలు సాగుతున్నాయని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. *చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్* పెట్టుబడులు పెరిగి, అప్పుల పాలవుతున్న తరుణంలో ఎరువుల డీలర్లు ఇలా దోపిడీకి పాల్పడటం సరికాదని రైతులు పేర్కొంటున్నారు. ముత్తారం మండలంలో తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్న ఫెర్టిలైజర్ షాపులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన షాపుల లైసెన్సులను రద్దు చేసి, యజమానులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటలపైవు మారాలి

### చొప్పదండి మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేశ్

**ప్రజాపక్షం / చొప్పదండి :** నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో పాటు ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన చెందవద్దని ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లాలని చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులు ఆలస్యంగా ఈనెల 6న రాష్ట్రాన్ని తాకిన రుతు పవనాలు సరిహద్దు దాటి చురుకుగా ముందుకు కదలకపోవడంతో పొలాలు మండిపోతున్నాయని మృగశిర ప్రవేశించి 10 రోజులు గడిచినా వర్షాలు కురవక 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని ఇది రోహిణి కార్తె ఎండలను తలపిస్తుందని అన్నారు. ఈసారి ఎల్‌నినో ప్రభావం బలంగా ఉండడంతో చొప్పదండి మండలంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతమే నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతి వర్షాకాలం జిల్లాలో వేల ఎకరాల్లో వరి, వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారని ఈసారి కరువు సంకేతాలతో పంటల ప్రణాళిక మార్చాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మండల రైతులు ఈసారి వరి స్థానంలో కంది, పెసర, మినుములు, సజ్జలు, రాగులు, నువ్వులు, జొన్నలు వంటి చిరుధాన్యాలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ ద్వారా సూచిస్తున్నామని తెలిపారు. మొక్కజొన్న తయారయ్యే ఉత్పత్తుల పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తామని చెప్పారు. రైతులను చైతన్యవంతం చేసేందుకు గ్రామాలవారిగా సమావేశాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచుతామన్నారు. వాతావరణ అంచనాలను ఎప్పటికప్పుడు వివరిస్తామని యూరియా కృత్రిమ కొరత సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పిఏసిఎస్‌లలో యూరియా అమ్మకాలు జరుపుతామని తెలిపారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ కేంద్ర, రాష్ట్ర పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.